క్లుప్తంగా

సైబర్ నేరాలపై విస్తృత అవగాహన



విజయవాడస్పోర్ట్స్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనార్థం ఇంద్రకీలాద్రికి చేరుకునే భక్తులకు సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు సైబర్ సీఐ బి.గుణరామ్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఉత్సవాల ప్రారంభం రోజు నుంచే భక్తులకు సైబర్ భద్రతను వివరిస్తున్నామన్నారు. క్యూ లైన్ మార్గం వెంబడి పలు రకాలైన సైబర్ నేరాలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులకు ఇంటర్నెట్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోసపూరిత మెసేజ్‌లను గుర్తించడం, పాస్‌వర్డ్‌లను రక్షించుకోవడం తదితర అంశాలను సైబర్ కమాండోలు, సైబర్ సోల్జర్స్ వివరిస్తున్నారన్నారు. సోమవారం వినూత్నంగా లుక్ వాకర్స్ ద్వారా భక్తులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించామని తెలిపారు.

తులసి మొక్కల పంపిణీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులకు సోమవారం కనకదుర్గానగర్‌లో తులసీ మొక్కలను పంపిణీ చేశారు. తులసీ, కృష్ణ తులసీ, విష్ణు తులసీ, కదంబం, మారేడుతో పాటు ఉసిరి మొక్కలను ఆలయ ఈవో కెఎస్.రామరావు భక్తులకు అందజేశారు. సుమారు 15 వేల మొక్కలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశామని ఈవో పేర్కొన్నారు. పంపిణీలో మొక్కల దాతతో పాటు ఈఈ లింగం రమాదేవి, డీఈ రవీంద్ర, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సహోద్యోగికి ఆర్పీఎఫ్ సిబ్బంది ఆర్థిక సాయం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సహోద్యోగి కుటుంబానికి విజయవాడ డివిజన్ ఆర్పీఎఫ్ ఉద్యోగులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. విజయవాడ ఆర్పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.సుధాకర్ గతేడాది ఆగస్టు నుంచి బ్రెయిన్ క్యాన్సర్‌తో లాలాగూడ రైల్వే హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బ్రెయిన్‌కు రెండు సర్జరీలు అయినప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో సుధాకర్ కుటుంబం ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు పడుతుంది. ఈ పరిస్థితిని గుర్తించిన విజయవాడ ఆర్పీఎఫ్ సిబ్బంది రూ.1.43 లక్షలను సుధాకర్ భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ సీనియర్ డీఎస్పీ వల్లేశ్వర బి.టి మాట్లాడుతూ.. సహోద్యోగి కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకురావటం అభినందనీయమన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాల్లో భాగంగా చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనం ఇచ్చిన అమ్మవారిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం సత్కరించి ప్రసాదాలను అందజేశారు. డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్, ఆలయ పాలక మండలి సభ్యులు బెవర శ్రీనివాసరావు, పొట్నూరి దుర్గాప్రసాద్, లింగిపిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతరాలయంలో ఫొటో కలకలం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి అంతరాలయంలో ఒక కానిస్టేబుల్ ఫొటో తీయటం ఆలయంలో కలకలం సృష్టించింది. ఆలయానికి వచ్చిన అధికారులను అంతరాలయంలోకి తీసుకెళ్లేందుకు పోలీసు శాఖ పక్షాన ప్రొటోకాల్ సిబ్బందిని ఆ శాఖ ఏర్పాటు చేసింది. ఆ క్రమంలో అంతరాలయంలోకి వెళ్లిన కానిస్టేబుల్ ఫొటో తీశారు. విషయాన్ని గమనించిన ఆలయ సిబ్బంది ఆయనను వెంటనే మందలించి స్థానిక ఆలయ అధికారులకు తెలిపారు. దీంతో కానిస్టేబుల్ తీసిన ఫొటోను డిలీట్ చేయించి, మందలించి పంపినట్లు తెలిసింది.

చండీమాతా ప్రణామం !

ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాలు శోభాయమానంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం శ్రీమహాచండీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



హారతి తీసుకుంటున్న భక్తజనం



నృత్యం చేస్తున్న కళాకారిణులు





హోమం నిర్వహిస్తున్న అర్చకులు



కనులపండువగా నగరోత్సవం

అభివృద్ధిని అటకెక్కించారు

- డీఎస్ఎంసీ హైస్కూల్ భవన నిర్మాణానికి గ్రహణం !
- రూ.3.41 కోట్ల మన బడి నాడు – నేడు నిధుల మంజూరు
- పార్షియల్ బిల్ ఇవ్వని కూటమి ప్రభుత్వం
- నిలిచిన నిర్మాణ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో నిర్మిస్తున్న దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్(డీఎస్ఎంసీ) హైస్కూల్ నూతన భవనానికి గ్రహణం పట్టింది. విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టిన గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం, మన బడి నాడు – నేడు కార్యక్రమంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి వాటి రూపు రేఖలు మార్చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కుమ్మరిపాలెం సెంటర్‌లో బ్రిటిష్ కాలంలో నిర్మించిన డీఎస్ఎంసీ హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా తరగతి గదులు లేకపోవడంతో ఆ భవనాన్ని తొలగించి నాడు – నేడు కార్యక్రమం ద్వారా జీ ప్లస్ టూ నూతన భవనం నిర్మించేందుకు అనుమతులు తీసుకున్నారు. నూతన భవన నిర్మాణానికి ఎస్టిమేషన్ వేయించి మన బడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.3.41 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు అప్పటి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు 2023 మార్చి 28న శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఎప్పటికో హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి పునాదులు తీయటం మొదలై ఇప్పటి వరకు అంటే సంవత్సరం ఏడు నెలలకు బేస్‌మెంట్ స్థాయికి చేరుకుంది. అంతే ఇక అక్కడ నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పనులన్నీ ఆగిపోయాయి.

నాడు – నేడు పనుల్లో నిర్లక్ష్యం

డీఎస్ఎంసీ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి సంబంధించి నాడు – నేడు కార్యక్రమం నిబంధనల మేరకు స్కూల్ పేరెంట్ కమిటీ, మేనేజ్‌మెంట్ కమిటీ పేరుతో జాయింట్ బ్యాంక్ అకౌంట్ ఉంటుంది. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సెక్షన్ సూచనల మేరకు ఆయా కమిటీ సభ్యులే మెటీరియల్ కొనుగోలు చేస్తారు. ఒక తాపీ మేస్త్రిని పెట్టుకుని పనులు చేయించుకుంటారు. నిర్మాణ పనుల్లో దశల వారీగా ప్రభుత్వం కమిటీ జాయింట్ అకౌంట్‌లో చెల్లింపులు చేస్తుంది. హైస్కూల్ నూతన భవనానికి 2023 మార్చిలో శంకుస్థాపన చేస్తే తొలి దశగా ఆగస్టులో కొంత, తిరిగి ఈ ఏడాది జనవరి నెలలో మరి కొంత మొత్తాన్ని చెల్లించింది. అంతే ఆ తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అనేక ప్రజా సంక్షేమ పథకాలు, మంచి కార్యక్రమాలను పక్కన పెట్టేసింది. ముఖ్యంగా విద్యా రంగంలో సత్ఫలితాలను ఇచ్చిన మన బడి నాడు – నేడు కార్యక్రమాన్ని కూడా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అందులో భాగంగానే డీఎస్ఎంసీ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం పార్షియల్ బిల్ చెల్లించకపోవడంతో మేస్త్రి పనులు నిలిపి వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి నిధులు విడుదల చేస్తుందా.. లేదా పక్కన పెట్టేస్తుందా అన్న అనుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి.





బేస్‌మెంట్ దశలో నిలిచిపోయిన పనులు (ఇన్‌సెట్) హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి వేసిన శంకుస్థాపన శిలాఫలకం



చండీ అమ్మవారుగా గంగానమ్మ తల్లి



పార్వతీదేవిగా విజయదుర్గా అమ్మవారు



చండీమాతగా గంగానమ్మ



లలితాత్రిపురసుందరీదేవిగా భ్రమరాంబ మాతా


భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

నగరంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నగర వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాలు, మండపాల్లో అమ్మవార్లు విశేష అలంకారాల్లో దర్శనమిస్తున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహిస్తున్నారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

–చిట్టినగర్, వన్‌టౌన్, వించిపేట(విజయవాడపశ్చిమ)



లలితా త్రిపుర సుందరీదేవిగా మహాలక్ష్మి మాతా



దాసాంజనేయస్వామి ఆలయంలో మహాచండీదేవి అలంకరణలో..



శ్రీ మహాచండీదేవిగా చదును మహాలక్ష్మి



ధనలక్ష్మిగా పద్మావతి అమ్మవారు



మహాచండీదేవిగా శాంభవీమాత

కాలుష్య రహిత నగరానికి చర్యలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సోమవారం ఆయా శాఖాధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన నగరంలో పచ్చదనం పెరుగుదల, నగర సుందరీకరణ, కాలుష్య నియంత్రణకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల అభివృద్ధి, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, అనధికార నిర్మాణాలు తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తీసుకున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి..

అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో ఎక్కువ మొక్కలను నాటాలని, అందుకు ప్రజలను భాగస్వాములను చేయాలని చెప్పారు. కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేలా నగర సుందరీకరణ చేయటానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో వాయు కాలుష్యమే కాకుండా నీటిని కూడా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల అభివృద్ధి ద్వారా శుద్ధి చేస్తూ నీటి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో అనధికార నిర్మాణాలు జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయాలని, అధికారులందరూ వారి డివిజన్లలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, వివిధ విభాగాల ఇంజినీర్లు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

వరదల పేరుతో దోపిడీకి తెగబడ్డారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరదల పేరుతో దోపిడీకి తెగబడ్డారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ అన్నారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలకు చంద్రబాబు రూ.534 కోట్లకు టెండర్ పెట్టారన్నారు. విజయవాడ ప్రజలకు వరదల వలన కష్టాలు, కన్నీళ్లు మిగిలితే కూటమి నాయకులకు, చంద్రబాబుకు కోట్లాది రూపాయలు మిగిలాయన్నారు. చంద్రబాబుకు ఒక పక్క ఫొటో షూట్స్.. మరో పక్క విరాళాల వరద వచ్చిందని దుయ్యబెట్టారు. వరదల్లో రూ.100 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. పునరావాసం కోసం కోటి 40 లక్షలు, రూ.368 కోట్లు ఫుడ్ కోసం ఖర్చు చేశామని చెబుతున్నారని పేర్కొన్నారు. బాధితులకు నష్ట పరిహారం కోసం కనీసం రూ.200 కోట్లు ఇవ్వలేదన్నారు. వరద బాధితులకు పలు ఆలయాల నుంచి ఆహారం వచ్చిందన్నారు. కానీ దేవుడు పేరుతో భోజనాలు పెడితే రూ.368 కోట్లు ఫుడ్‌కి ఏ పందికొక్కులు తిన్నాయో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. రూ.26 కోట్లతో వాటర్ బాటిల్స్, రూ.52 కోట్లు శానిటేషన్, కొవ్వొత్తులు, అగ్గి పెట్టెలకు రూ.23 కోట్లు ఖర్చు చేశారని చెబుతున్నారని అవి ఎక్కడో చేశారో చెప్పాలని ప్రశ్నించారు. వరద బాధితులను పరామర్శించని పవన్.. మత విద్వేషాలను రెచ్చ కొడుతున్నాడని, పవన్‌కి ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

'సచివాలయ బ్యాచ్ మొత్తం వైసీపీ వాళ్లే..'

- వారం పది రోజుల్లో మొత్తాన్ని పీకేయిస్తాను
- టీడీపీ మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య ఫోన్ సంభాషణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'సచివాలయ బ్యాచ్ మొత్తం వైసీపీ వాళ్లే ఉన్నారు. ఏం చేస్తాం? ఒక పక్క నుంచి పీక్కుంటూ వస్తున్నాం. ఒకరా.. ఇద్దరా ఆపడానికి. వారం ఆగితే అందరినీ రిమూవ్ చేస్తాం. వారం పదిరోజుల్లో మొత్తాన్ని తీసి పారనూకుతాం. వాళ్లిష్టమొచ్చినట్లు కొట్టుకుంటూ పోయారు. మనోళ్లకు రాలేదు. వాడి మీద ఫిర్యాదు పెట్టు.. వాడి జాబ్ తీయించి పారనూకుతాను' అంటూ సచివాలయ ఉద్యోగుల గురించి పశ్చిమ నియోజకవర్గ టీడీపీ మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య ఆ పార్టీ కార్యకర్తతో చేసిన ఫోన్ సంభాషణ. ఇప్పుడది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 42వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త కిషోర్ మాజీ కార్పొరేటర్ రామయ్యకు ఫోన్ చేసి.. వరద నష్ట పరిహారం అందలేదని చెప్పాడు. ఫలానా వాళ్లకు రూ. 1.25లక్షలు పడ్డాయి. మన వాళ్లు మొత్తం కోల్పోయిన రూ. 3వేలు పరిహారం ఇచ్చారంటూ రామయ్యతో ఫోన్‌లో మాట్లాడాడు. టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి రూ. లక్ష, రెండు లక్షలు వేశారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి ఏమీ ఇవ్వలేదు. ఇదేం న్యాయమంటూ రామయ్యను అడిగాడు. దీంతో రామయ్య ఒక్కసారిగా.. సచివాలయ బ్యాచ్ మొత్తం వైసీపీ వాళ్లేనంటూ రెచ్చిపోయాడు. ఫోన్ సంభాషణతో నియోజకవర్గంలోని సచివాలయ ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ సంభాషణలో వాడిన బాష, సచివాలయ ఉద్యోగులను వాడు వీడు అంటూ మాట్లాడిన తీరుపై పలువురు మండిపడుతున్నారు. ఇలాంటి ఆడియోలు రికార్డు చేసి వాటిని వైరల్ చేయడం రామయ్యకు అలవాటేనని, సచివాలయ ఉద్యోగులంతా వైఎస్సార్ సీపీ వాళ్లేనంటూ బెదిరించి వారిని తన ఆధీనంలో పెట్టుకునే కుట్రలో భాగంగానే ఆడియో వైరల్ చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో వాళ్ల పార్టీ నాయకులు ఫోన్‌లో మాట్లాడిన సంభాషణల ఆడియోలు కూడా ఇలాగే వైరల్ అయ్యాయని నాయకులు చర్చించుకుంటున్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలు ఇవ్వండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములకు సంబంధించిన వివరాల నివేదికను అందజేయాలని సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ జయలక్ష్మి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన వీసీలో పాల్గొన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినవి, చట్టాన్ని ఉల్లంఘించిన వాటి పూర్తి వివరాలను నివేదికలో స్పష్టంగా తెలియజేయాలని సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ వివరించారు. ఇప్పటికే సమర్పించిన వివరాలను పునః పరిశీలించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ జరిగిన భూముల వివరాలను నివేదికలో పొందుపరచాలన్నారు. కాన్ఫరెన్స్‌లో భూ సేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు కళానీరాజనం

విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా కనకదుర్గానగర్‌లోని కళా వేదికపై కళాకారులు, సంగీత విద్వాంసులు, నాట్యాచార్యులు కళా నీరాజనాలు సమర్పిస్తున్నారు. ఎన్.రామాంజనేయుడు భక్తి సంకీర్తనలతో సోమవారం కార్యక్రమాలను ప్రారంభమయ్యాయి. డి.దీపిక, దుర్గేసి నందిని, వీవీఎస్ ప్రసాద్‌లు భక్తి గీతాలను ఆలపించారు. నృత్య కార్యక్రమంలో భాగంగా నాట్యాచార్యుడు వేదాంతం పార్థసారథి, భాగవతుల సౌమ్య, జోస్యుల శ్రీరామ చంద్రమూర్తి, ఎంవీఎల్ సత్యవాణి, నవ్య, ఎం.అలేఖ్య సెల్వరాజ్, పీఎస్ఎల్ రజింత్, డి.విజిత, కే నీరజ, లీలా కుమారి, హిమకురిలు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి తదితరులు రచించిన కీర్తనలకు నృత్యాలను అభినయించారు. తమకు సరైన ఏర్పాట్లు కల్పించలేదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలైన ఘటన సోమవారం భవానీపురం ఔట్ ఏజెన్సీ ఎదురుగా గల విజయదుర్గా టింబర్ డిపో సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన షేక్ నాగుల్ షరీఫ్ భార్య కరీమున్నీషా, కుమారుడు సలామ్ గౌస్‌తో కలిసి యాక్టివాపై విజయవాడ ఆసుపత్రికి బయలుదేరారు. భవానీపురం ఔట్ ఏజెన్సీ ఎదురుగా ఉన్న విజయవాడ దుర్గా టింబర్ డిపో వద్దకు చేరుకోగానే గొల్లపూడి నుంచి విజయవాడ వెళ్తున్న కారు వేగంగా వచ్చి వెనుక నుంచి యాక్టివాను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగుల్ షరీఫ్, కరీమున్నీషాలకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న నాగుల్ షరీఫ్ స్నేహితులు ఇరువురిని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాలి

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 50వ డివిజన్‌లో తాగునీటి ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ బోయి సత్యబాబు అధికారులను కోరారు. నగరపాలక సంస్థ వాటర్ సెక్షన్ ఏఈ రాజేష్‌తో కలిసి సత్యబాబు సోమవారం గొల్లపాలెంగట్టు ప్రాంతం, టీఎస్‌పీ వారివీధి, మేకలవారివీధి, ఆలేటివారివీధుల్లో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ డివిజన్‌లోని కొండ ప్రాంతాలలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగటం లేదన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీనిపై నగరపాలకసంస్థ అధికారులు తక్షణమే దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానికులు పి.రాజు, కె.లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.